# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వ శాఖల్లోని దస్త్రాలు, రికార్డులను భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల విభాగాధిపతులకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదేశాలు జారీ చేశారు.**
2. **ఎన్నికల్లో గెలిపించిన ప్రజల పట్ల శాసన సభ్యులు, లోక్‌సభ సభ్యులు జవాబుదారీగా ఉండాలని జనసేన అధ్యక్షులు కె. పవన్ కల్యాణ్ అన్నారు.**
3. **మిత్రపక్షంగా ఉంటూనే ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసువెళ్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్కొన్నారు.**
4. **ప్రజల పక్షాన పోరాడేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధమేనని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు.**
5. **రాష్ట్ర ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఏపీసీసీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిల తెలిపారు.**

=========================

వివిధ ప్రభుత్వ శాఖలు, విభాగాల్లోని దస్త్రాలు, రికార్డులను సురక్షితంగా భద్రపరిచేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయా శాఖలు, విభాగాధిపతులకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నిన్న ఆదేశాలు జారీ చేశారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి అందిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఆయా శాఖల కార్యదర్శులు, విభాగాధిపతులకు నోటీసులు పంపించారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు భూముల కేటాయింపులు, గుత్తేదారులకు నిధుల విడుదల, అధికారుల బదిలీలకు సంబంధించిన ఎలాంటి దస్త్రాలని ముందుకు పంపవద్దని స్పష్టం చేశారు. మంత్రుల కార్యాలయాల్లోని దస్త్రాలు, ఈ–ఫైల్స్ రూపంలో ఉన్న అన్ని అధికారిక రికార్డులను సురక్షితంగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు.

-------------------------

ఎన్నికల్లో గెలిపించిన ప్రజల పట్ల శాసన సభ్యులు, లోక్‌సభ సభ్యులు జవాబుదారీగా ఉండాలని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిన్న ఆయన ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, వచ్చిన ప్రతి ఓటూ బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. ప్రజాప్రతినిధులు ఏం మాట్లాడినా ప్రజలు గమనిస్తారని కాబట్టి బాధ్యతాయుతంగా అందరూ వ్యవహరించాలని హితవు పలికారు. భావితరాల వారు స్ఫూర్తిగా తీసుకునేలా

జనసేన ప్రయాణం ఉంటుందని తెలిపారు.

---------------------------

మిత్రపక్షంగా ఉంటూనే ప్రజల సమస్యలను నిర్మాణాత్మకంగా ప్రభుత్వం దృష్టికి తీసువెళ్తామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం లోక్‌సభ సభ్యురాలు పురందేశ్వరి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నిన్న పార్టీ శ్రేణులతో ఆమె సమావేశమయ్యారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ, ఎన్డీయే కూటమిలోని పార్టీల ఆలోచనా విధానాలు భిన్నమైనా ఎన్నికలలో చక్కటి సమన్వయంతో విజయం సాధించామన్నారు. రాష్ట్రంలో బీజేపీ 8 శాసనసభ స్థానాల్లో 3 పార్లమెంట్ స్థానాల్లో గెలిచిందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం కేంద్ర నిధులను పక్కదోవ పట్టించారని.. వీటన్నింటిపై త్వరలో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

---------------------------

ప్రజల పక్షాన పోరాడేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విశాఖపట్నంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాల్సిందేనని అన్నారు. రాష్ట్రానికి విశాఖ కీలకమని విశాఖ నగరానికి ఉన్న అవకాశాల్ని కూటమి గుర్తించాలని ఆ విషయంలో కూటమి దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజా తీర్పునకు అనుగుణంగా కూటమి పని చేయాలని అమర్‌నాథ్ వివరించారు.

---------------------------

రాష్ట్ర ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఏపీసీసీ అధ్యక్షురాలు వై.యస్ షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కూటమి నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడే కొత్త ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు, రాజధాని నిర్మాణం, పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులూ పూర్తి చేయాలని తెలిపారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ జనం గొంతుకగా మారిన కాంగ్రెస్ ఇక మీదటా అదే మార్గాన్ని కొనసాగిస్తుందని షర్మిల పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఓట్లతోనే సమాధానం చెప్పారని జనసేన సీనియర్ నాయకులు, నాదెండ్ల మనోహర్ అన్నారు. తెనాలిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, తెనాలి శాసనసభ స్థానంలో గెలుపుకు సహకరించిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు తాము ఇచ్చిన హామీలను అమలుచేస్తామని, వారు ఇచ్చిన సలహాలను తప్పక పాటిస్తామని పేర్కొన్నారు.

---------------------------

పల్నాడు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందని, ఘర్షణలకు పాల్పడేవారిపై చర్యలుతీసుకుంటామని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ హెచ్చరించారు. జిల్లాలోని చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్ల, యడ్లపాడు పోలీస్ స్టేషన్లను నిన్న ఆమె సందర్శించారు. రెండు మండలాల్లో ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జరిగిన ఘటనల గురించి అడిగి తెలుసుకున్నారు. రక్షణ చర్యల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం మలికా గార్గ్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా ముగిసిందని చెప్పారు. ఫలితాల అనంతరం కొద్దిపాటి అల్లర్లు జరిగాయని చెప్పారు. చిన్న ఘటనను సైతం

త్రీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగానే జిల్లాలో 144 సెక్షన్‌ను కఠినంగా అమలు చేశామని పేర్కొన్నారు.

---------------------------

వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తూర్పుగోదావరి జిల్లా ఉప వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.కె.హరిబాబు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరంలోని కంబాలపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, ప్రతి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ వార్డు సచివాలయల పరిధిలో నీటి నిల్వలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులకు సూచించారు.

---------------------------

దేశంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆహారధాన్యాల ఉత్పత్తి మూడు వేల 288 లక్షల టన్నులకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రధాన వ్యవసాయ పంటల మూడవ ముందస్తు అంచనాల నివేదిక ప్రకారం, మొత్తం వరి ఉత్పత్తి వెయ్యి 367 లక్షల టన్నులుగా ఉంటుందని, గోధుమ ఉత్పత్తి వెయ్యి 129 లక్షల టన్నులుగా అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఇది గత సంవత్సరం గోధుమ ఉత్పత్తి కంటే 23 లక్షల టన్నులు అధికమని పేర్కొంది. అలాగే కంది ఉత్పత్తి సుమారు 34 లక్షల టన్నులుగా ఉంటుందని అంచనావేస్తున్నామని ఇది గత సంవత్సరం ఉత్పత్తి కంటే 0.73 లక్షల టన్నులు ఎక్కువని వివరించింది. విస్తీర్ణం, ఉత్పత్తి, దిగుబడికి సంబంధించిన ముందస్తు అంచనాలలో ఖరీఫ్, రబీ సీజన్లు ఉన్నాయని మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

భారత పోలీస్ సర్వీస్ ఐపీఎస్ అధికారులు బిందుమాధవ్, అమిత్‌బర్దార్‌పై సస్పెన్షన్‌ను తొలగిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ రోజు, తర్వాత పల్నాడు, అనంతపురం జిల్లాల్లో జరిగిన ఘర్షణలను అడ్డుకోవడంలో ఆయా జిల్లాల ఎస్పీలుగా విఫలమయ్యారనే కారణంతో మే 16న సస్పెండ్ చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలనిచ్చింది. తాజాగా వాటిని ఉపసం హరించుకుంటున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఇప్పటికే రాయలసీమ జిల్లాల్లో పూర్తిగా విస్తరించాయని, రాబోయే 3 లేదా 4 రోజుల్లో కోస్తాంధ్రలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూలంగా ఉన్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమ పరిసర ప్రాంతాల్లో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి భారీవర్షాలకు అవకాశముందని పేర్కొంది. ఈరోజు అల్లూరిసీతారామరాజు, బాపట్ల, ఏలూరు, కాకినాడ, కృష్ణా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. వర్షాలతో పాటు పిడుగులు పడే అవ కాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది.

---------------------------

శ్రీకాకుళం నియోజక వర్గం సమగ్రాభివృద్ధికి ఆరు సూత్రాల ప్రణాళిక అమలు చేస్తామని టీడీపీ తరపున శ్రీకాకుళం శాసనసభ్యునిగా ఎన్నికైన జి.శంకర్ అన్నారు. ఈరోజు శ్రీకాకుళంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సహకారంతో శ్రీకాకుళం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కోడి రామ్మూర్తి స్టేడియంను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తామని, శ్రీకాకుళం నుండి ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు వెళ్ళే రహదారి పనులు శరవేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుండి గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు సాగునీరు ఇబ్బంది లేకుండా చేసేందుకు వంశధార, నాగావళి నదుల సాగునీటి కాలువలను పొడిగించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

---------------------------

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రజా కూటమి పాలన సాగిస్తుందని గన్నవరం శాసనసభ సభ్యులు వై.వెంకట్రావు తెలిపారు. ఈ రోజు విజయవాడలో ఆయన మాట్లాడుతూ, భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో ముందుండే విధంగా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో అనేక వాణిజ్య సంస్థలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

=======================